RNI TELTEL 2024/90138

# సూర్య

జాతీయ తెలుగు దినపత్రిక

తెలుగు

సూర్య తెలుగు 5th ANNIVERSARY
5 సంవత్సరాల విశ్వాసం... మీతోనే మా ప్రయాణం




హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, మహబూబాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం | మంగళవారం, జూలై 21, 2026 | ప్రధాన సంపాదకులు : కురిమిళ్ల చంద్రశేఖర్ గౌడ్ | సంపుటి: 5 | సంచిక : 122 | పేజీలు: 8 | వెల: రూ.5

# సమాజంలో జరుగుతున్న అవినీతి, అన్యాయాలపై మాజీ సైనికులు పోరాడాలి

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు





**సిటీ బ్యూరో జూలై 20 సూర్య న్యూస్ :-** సమాజంలో జరుగుతున్న అవినీతి, అన్యాయాలపైమాజీ సైనికులు పోరాడాలని, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పిలుపు నిచ్చారు. బిజెపి రాష్ట్ర ఎక్స్-సర్వీస్‌మెన్ సెల్ ప్రతినిధుల సమావేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సరిహద్దుల్లో దేశాన్ని రక్షించిన మాజీ సైనికులు, రిటైర్మెంట్ తర్వాత సమాజంలో జరుగుతున్న అవినీతి, అన్యాయాలపై పోరాడాలని, సైనిక క్రమశిక్షణతో పనిచేసి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో తొలిసారిగా ఎక్స్-సర్వీస్‌మెన్ సెల్ ప్రతి జిల్లా నుంచి కన్వీనర్లతో బలమైన టీమ్‌లను ఏర్పాటు చేసుకుని, పార్టీలో అత్యంత క్రియాశీలక వింగ్‌గా రూపుదిద్దుకోవడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. న్యాయవాదులకు లీగల్ సెల్, కార్మికులకు లేబర్ సెల్ ఎలాగైతే పనిచేస్తాయో, ఎక్స్-సర్వీస్‌మెన్ సెల్ కూడా దేశ సరిహద్దుల్లో సేవలు అందించిన సైనికులకు అండగా ఉంటుందని అన్నారు. కలెక్టరేట్లలో ఉండే రిటైర్డ్ ఎంప్లాయీస్ బోర్డులు సక్రమంగా పనిచేసేలా చూడటంతో పాటు, మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి, దేశ సమస్యలపై స్పందించడానికి ఈ సెల్ చొరవ తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.రాబోయే జూలై 26న 'కార్గిల్ విజయ్ దివస్'ను రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించాలని సూచించారు. 2014లో రూ. 686 కోట్లుగా ఉన్న రక్షణ ఎగుమతులు నేడు రూ.38,400 కోట్లకు పెరిగాయని, రక్షణ బడ్జెట్ రూ.2.5 లక్షల కోట్ల నుంచి రూ.8 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించారు. రక్షణ ఉత్పత్తుల విలువ

(మిగతా 2వ పేజీలో)

# ఆల్ ఇంగ్లాండ్ జూనియర్ ఓపెన్‌లో తెలంగాణ యువ షట్లర్ సాయి నచికేత్ చరిత్ర

## అండర్-19 బాలుర సింగిల్స్ టైటిల్ గెలిచిన తొలి భారతీయుడు

**స్పోర్ట్స్ బ్యూరో జూలై 20 సూర్య న్యూస్ :-** తెలంగాణకు చెందిన యువ షట్లర్ సాయి నచికేత్ భత్రాజు అంతర్జాతీయ వేదికపై చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక యోనెక్స్ ఆల్ ఇంగ్లాండ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్--2026 అండర్-19 బాలుర సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకొని, ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా నిలిచాడు. ఫైనల్లో భారత ఆటగాడు కె.సుహాస్పై విజయం సాధించిన సాయి నచికేత్, టోర్నమెంట్ మొత్తం అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి ఛాంపియన్‌గా అవతరించాడు. తెలంగాణ యువ క్రీడాకారుడి ఈ చారిత్రక విజయం రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచింది. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో సాయి నచికేత్ పేరు చిరస్థాయిగా నిలిచే విజయంగా క్రీడా వర్గాలు అభివర్ణిస్తున్నాయి.






# బహదూర్‌గూడ భూములపై బ్రేక్

- 28.06 ఎకరాల్లో బలవంతపు చర్యలు నిలిపేయాలని హైకోర్టు ఆదేశం
- ఫెన్సింగ్, స్వాధీనం ప్రక్రియ కొనసాగించొద్దని ప్రభుత్వానికి స్పష్టీకరణ
- ఇరు పక్షాలకు కౌంటర్ల దాఖలుకు ఆదేశాలు.. విచారణ వచ్చే వారానికి వాయిదా
- ఇదే అంశంపై మరో 85 మంది పిటిషన్‌పై నేడు విచారణ




# పార్లమెంటు ముట్టడితో ఢిల్లీ ఉద్రిక్తం

- చలో పార్లమెంటుతో వీధులన్నీ ఆందోళనకారులతో కిక్కిరిసిన రాజధాని
- బారికేడ్లు దాటే యత్నం.. బాష్పవాయు, లాఠీఛార్జితో రణరంగం
- సీజేపీ ప్రతినిధులతో కేంద్రం చర్చలు.. డిమాండ్లపై సానుకూల స్పందన అన్న పార్టీ
- జంతర్‌మంతర్ వేదిక తొలగింపు.. కేరళ హౌస్ వద్దకు దీక్ష మార్పు

# ట్రైనీ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం

- మహిళా అధికారిణిపై వేధింపుల కేసు.. ఐపీఎస్ ట్రైనీ ఆత్మహత్యాయత్నం
- హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో విషం తాగి అపస్మారక స్థితిలోకి
- అంతకుముందు తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని సోషల్ మీడియాలో పోస్ట్
- పోలీస్ కానిస్టేబుల్‌గా జీవితం ప్రారంభించి ఐపీఎస్‌కు ఎంపికైన ఉదయ్ కృష్ణారెడ్డి
- పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



# కరవుపై సర్కారు చేతులెత్తేసింది: కేటీఆర్

- ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శ
- మేడిగడ్డ మరమ్మతులు చేయకుండా ప్రాజెక్టును నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపణ
- రైతులకు నీరు అందించే అవకాశాన్ని ప్రభుత్వం వదులుకుందని వ్యాఖ్య
- భారాసలో చేరిన మోరిల్ శ్రీనివాస్



హైదరాబాద్: రాష్ట్రంలో కరవు పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎల్‌నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు నెలల ముందే హెచ్చరించినా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. సోమవారం

(మిగతా 2వ పేజీలో)



# వాణిజ్య నౌకపై దాడి

- నలుగురు భారతీయులు దుర్మరణం.. మరొకరి పరిస్థితి విషమం
- ఒడెస్సా నుంచి బయల్దేరిన నౌకపై క్షిపణి దాడి
- మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన విదేశాంగశాఖ
- వాణిజ్య నౌకలపై దాడులను ద భారత్ తీవ్రంగా ఖండించింది

న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌లోని ఒడెస్సా పోర్టు నుంచి బయల్దేరిన వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో నలుగురు భారతీయులు ప్రాణాలు కోల్పోగా, మరో భారతీయుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కేంద్ర విదేశాంగశాఖ వెల్లడించింది. గినియా-బిస్సావు జెండాతో ప్రయాణిస్తున్న ఎంవీ గోల్డెన్ లియో నౌకపై

(మిగతా 2వ పేజీలో)

# ఎల్‌నినోపై ముందస్తు వ్యూహం

- తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులకు ఆదేశాలు
- ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచన
- 2028 ఆగస్టుకల్లా ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేస్తామని వెల్లడి
- ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధమని ధీమా



# విద్యాశాఖ అధికారుల మౌనం వెనుక అసలు నిజం ఏమిటి?

- బి.ఎడ్ ఉపాధ్యాయుల కొరత, ఫైర్ సేఫ్టీ అనుమతులు లేకపోవడం, పార్కింగ్ వంటి ప్రాథమిక నిబంధనలు పాటించకపోవడం పై ఆరోపణలు
- చర్యలు తీసుకోకపోవడానికి కారణమేంటి?
- ఈ వ్యవహారంలో ఎవరినైనా కాపాడుతున్నారా? లేక పరిపాలనా నిర్లక్ష్యమే ఇందుకు కారణమా?










**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి జూలై 19 సూర్య న్యూస్ :-**



విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై వరుస ఫిర్యాదులు, ఆర్‌టీఐ సమాధానాలు, పత్రికా కథనాలు వెలుగులోకి వస్తున్నప్పటికీ సంబంధిత విద్యాశాఖ అధికారులు ఇప్పటికీ ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోకి కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల లోని జగద్గిరిగుట్ట, షాపూర్ ప్రాంతాల్లోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో అర్హత కలిగిన బి.ఎడ్ ఉపాధ్యాయుల కొరత, ఫైర్ సేఫ్టీ అనుమతులు లేకపోవడం, పార్కింగ్ వంటి ప్రాథమిక నిబంధనలు పాటించకపోవడం పై ఆరోపణలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ అంశాలపై సంబంధిత శాఖలకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఆర్‌టీఐల ద్వారా వివరాలు వెలుగులోకి వచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు ప్రకటించబడలేదు. అయితే చర్యలు తీసుకోకపోవడానికి అసలు కారణమేంటి? తనిఖీలు నిర్వహించలేదా? నిర్వహించి ఉంటే నివేదికలను ఎందుకు బహిర్గతం చేయడం లేదు? ఉల్లంఘనలు గుర్తించినప్పటికీ చర్యలు ఆలస్యం కావడానికి కారణం ఏమిటి? అనే ప్రశ్నలు ప్రజలు, తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అధికారులు మౌనం పాటించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో ఎవరినైనా కాపాడుతున్నారా? లేక పరిపాలనా నిర్లక్ష్యమే ఇందుకు కారణమా? అనే సందేహాలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే




ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అక్రమాలు జరిగాయని తేలితే సంబంధిత పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే ఫిర్యాదులు ఉన్నప్పటికీ చర్యలు ఆలస్యం కావడానికి గల కారణాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎల్‌నినోపై ముందస్తు వ్యూహం

హైదరాబాద్: ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని, రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నల్లగొండ కలెక్టరేట్‌లో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరిపంటపైనే ఆధారపడకుండా రైతులు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.

## బహదూర్‌గూడ భూములపై బ్రేక్

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడ సర్వే నంబర్లు 3, 5లోని 28.06 ఎకరాల భూమికి సంబంధించి తదుపరి విచారణ పూర్తయ్యే వరకు ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేయడం సహా స్వాధీనం ప్రక్రియను నిలిపివేయాలని స్పష్టం చేసింది. ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేసు విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. గుర్రంగూడకు చెందిన రైతులు తమ ప్రైవేట్ భూమిలో అధికారులు అక్రమంగా జోక్యం చేసుకుంటూ ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ, 1989--90లో చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూమిలో మూడు దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్నప్పటికీ హైడ్రా అధికారులు గేట్లు తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని, పొలాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని కోర్టుకు వివరించారు.

## ట్రైనీ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం



హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌వీపీ ఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న ఐపీఎస్ ట్రైనీ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. తనతో పాటు శిక్షణ పొందుతున్న ఓ మహిళా అధికారిణిని లైంగికంగా వేధించారన్న ఆరోపణలపై కేసు నమోదైన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకుంది. మోతీనగర్‌లోని తన బంధువుల నివాసంలో ఉదయ్ కృష్ణారెడ్డి విషపూరిత పదార్థం సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. బంధువులు వెంటనే అతడిని ఎస్‌ఆర్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

# పార్లమెంటు ముట్టడితో ఢిల్లీ ఉద్రిక్తం

న్యూఢిల్లీ: నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఇచ్చిన 'చలో పార్లమెంటు' పిలుపు దేశ రాజధానిలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేలాది మంది కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, యువత పార్లమెంటు వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకోవడంతో పలుచోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. బారికేడ్లు దాటేందుకు ఆందోళనకారులు యత్నించగా బాష్పవాయు గోళాలు ప్రయోగించిన పోలీసులు లాఠీఛార్జి చేశారు. రాళ్ల దాడులు, తోపులాటలతో అటు ఆందోళనకారులు, ఇటు పోలీసులు గాయపడగా, పలువురు రక్తసిక్తంగా కనిపించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఉదయం 11.15 గంటల సమయంలో జంతర్‌మంతర్ నుంచి గ్రూపులుగా బయల్దేరిన నిరసనకారులు నినాదాలు చేస్తూ పార్లమెంటు వైపు కదిలారు. వారిలో విద్యార్థులు, తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు, యువతతో పాటు కొందరు పాఠశాల యూనిఫాంలలో, మరికొందరు ప్రత్యేక దుస్తుల్లో పాల్గొన్నారు. కొద్దిసేపటికే పలుచోట్ల బారికేడ్లను తొలగించి హైసెక్యూరిటీ జోన్‌లోకి ప్రవేశించేందుకు యత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు సెంట్రల్ సెక్రటేరియట్, పార్లమెంటు వీధి, పటేల్ చౌక్, రైల్ భవన్, శాస్త్రి భవన్ ప్రాంతాల్లో బాష్పవాయు గోళాలు ప్రయోగించి, లాఠీఛార్జి చేసి నిరసనకారులను చెదరగొట్టారు. ఆందోళనకారుల్లో కలిసిన కొందరు దుండగులు పోలీసులపై రాళ్లు, ఇతర వస్తువులు విసరడంతో పలువురు సిబ్బంది గాయపడ్డారు. నార్త్ ఢిల్లీ డీసీపీ రాజా బాంథియా సహా పలువురు పోలీసు అధికారులు గాయపడగా, మొత్తం 118 మంది సిబ్బంది గాయపడ్డారని పోలీసులు వెల్లడించారు. మరోవైపు ఆందోళనకారుల్లోనూ పలువురు గాయపడగా, సుమారు 65 మందిని ఆసుపత్రులకు తరలించారు. వంద మందికి పైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉద్రిక్త పరిస్థితుల మధ్య జంతర్‌మంతర్ వద్ద ఏర్పాటు చేసిన సీజేపీ వేదికను పోలీసులు తొలగించారు. అయినప్పటికీ వందలాది మంది అక్కడే వర్షంలో నిరసన కొనసాగించారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, గీతాంజలి తదితరులు తమ దీక్షా శిబిరాన్ని కేరళ హౌస్ వద్దకు మార్చారు. ప్రభుత్వం ఉత్తర కొరియా తరహాలో అణచివేతకు పాల్పడుతోందని వారు ఆరోపించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను కొనసాగిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సీజేపీ ప్రతినిధులతో చర్చలు జరిపింది. కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో జరిగిన సమావేశంలో తమ ప్రధాన డిమాండ్లపై సానుకూల స్పందన లభించిందని సీజేపీ ప్రకటించింది. అయితే చర్చించిన అంశాలను పరిశీలించి నిర్ణయం వెల్లడిస్తామని నడ్డా పేర్కొన్నట్లు సమాచారం. ఇదే సమయంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హోంమంత్రి అమిత్ షాతో సుదీర్ఘంగా సమావేశమవడం ప్రాధాన్యం

## కరవుపై సర్కారు చేతులెత్తేసింది: కేటీఆర్

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన పార్టీలో చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొని బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కరవు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు దెబ్బతిన్నాయని చెప్పి వాటికి మరమ్మతులు చేపట్టకుండా మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బాన్సువాడ, నిజామాబాద్ జిల్లాల రైతులకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీటిని సముద్రంలోకి వదులుతోందని విమర్శించారు. ప్రజల మద్దతుతో బాన్సువాడలో మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హనుమంత్ షిండే, జీవన్‌రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాణిజ్య నౌకపై దాడి

జులై 19న దాడి జరిగినట్లు తెలిపింది. ఘటన సమయంలో నౌకలో మొత్తం 17 మంది సిబ్బంది ఉండగా, వారిలో ఐదుగురు భారతీయులని పేర్కొంది. ఈ దాడిలో నలుగురు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నట్లు వెల్లడించింది. ఉక్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు విదేశాంగశాఖ తెలిపింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన కేంద్ర ప్రభుత్వం, వారి మృతదేహాలను వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. పౌర సిబ్బంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం, అంతర్జాతీయ నౌకాయాన, వాణిజ్య స్వేచ్ఛకు భంగం కలిగించడం ఏమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది. ఈ దాడికి రష్యా పాల్పడినట్లు అంతర్జాతీయ వర్గాల్లో సమాచారం వెలువడుతోంది.



## సూరారం పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన కే.బాలరాజు కి ఘన సన్మానం

**కుత్బుల్లాపూర్ జూలై 20 సూర్య న్యూస్ :-** సూరారం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన బాలరాజు ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి బిజెపి నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గాజుల రామారం డివిషన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి నల్ల జై శంకర్ గౌడ్, మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పులి బలరాం, శ్రీరాములు, మాధవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కే బాలరాజు గతంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహించిన సమయంలో, ముఖ్యంగా కరోనా మహమ్మారి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి శాంతి భద్రతలను సమర్థవంతంగా పరిరక్షించారని కొనియాడారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, నిష్పాక్షికంగా పరిష్కరించే అధికారిగా మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. మళ్లీ సూరారం పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టడం స్థానిక ప్రజలకు ఆనందదాయకమని తెలిపారు. ఆయన నాయకత్వంలో సూరారం పరిధిలో శాంతి భద్రతలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు సత్వర న్యాయం, మెరుగైన పోలీసు సేవలు అందుతాయనే పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.

## సమాజంలో జరుగుతున్న అవినీతి, అన్యాయాలపై మాజీ సైనికులు పోరాడాలి



రూ. 46,000 కోట్ల నుంచి రూ. 1.50 లక్షల కోట్లకు పెరిగిందని, ఆర్డినెన్స్ నిల్వల స్వయంసమృద్ధి 32% నుంచి 90%కి చేరుకుందని తెలిపారు. నేవీ, కోస్ట్ గార్డ్ నౌకల్లో 97% మేడ్ ఇన్ ఇండియా పరికరాలే ఉపయోగిస్తున్నామని, తేజాస్ యుద్ధ విమానాలు, ఐఎన్‌ఎస్ విక్రాంత్ వంటివి భారత రక్షణ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఒకప్పుడు ఉగ్రవాదంపై "చర్చలు" మాత్రమే ఉండేవి కానీ, ఇప్పుడు "చర్చలు లేవు – కేవలం చర్యలే" అనే విధానంతో ఉరి సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ ఎయిర్ స్ట్రైక్స్ ద్వారా సత్తాచాటిన భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా ఆవిర్భవించిందన్నారు. సైన్యంలో ఉన్నప్పుడు యూనిఫామ్‌లో దేశాన్ని కాపాడిన సైనికులు, రిటైర్మెంట్ తర్వాత కూడా సమాజంలోని అవినీతి,అన్యాయాలపై పోరాడి దేశాన్ని రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సైనిక క్రమశిక్షణతో పనిచేస్తూ అందరూ కలిసికట్టుగా పనిచేసి తెలంగాణలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

# నల్లగొండ జిల్లా కలెక్టర్ కు గ్రామ కార్యదర్శి డాకు నాయక్ పై ఫిర్యాదు

### జనరల్ బాడీ మీటింగులో ఎలాంటి లావాదేవీలు చూపడం లేదు

### పశువుల సంత కాంట్రాక్టర్ వద్ద డబ్బుల వసూల్ చేయడంలో నిర్లక్ష్యం గతంలో నిర్లక్ష్యం చేసి 60 లక్షలు మంది పాలు చేసిండు, దోమల నివారణకు చర్యలు కరువు , బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లలేని పరిస్థితి







కొండమల్లేపల్లి, జూలై 20 సూర్య న్యూస్ :- నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్ర గ్రామపంచాయతీ కార్యదర్శి డాకు నాయక్ పై కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ కి చెందిన ముగ్గురు వార్డు మెంబర్లు ఎలిమినేటి సాయి, బొడిగె శంకర్ గౌడ్ , బూడిద మంజుల మల్లేష్ యాదవ్ నల్లగొండ జిల్లా కలెక్టర్కు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ కు చేసిన ఫిర్యాదులో కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రతినెల ఏర్పాటు చేసే జనరల్ బాడీ మీటింగ్ లలో ఇలాంటి లావాదేవీలు చూపించకుండా మీనిట్ బుక్, లాంగ్ బుక్కులో స్పష్టంగా లెక్కలు చెప్పడం లేదు అంటూ పేర్కొన్నారు . విషయంపై అడిగితే నిర్లక్ష్యమైన సమాధానాలు తెలుపుతున్నారని, అన్ని బాగానే ఉన్నాయి అంటూ మాట దాట వేస్తున్నాడని, గ్రామపంచాయతీ పాలకవర్గం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్న కనీసం గ్రామంలో దోమల నివారణకు కూడా చర్యలు తీసుకోవడం లేదని , బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లే పరిస్థితి కనపడలేదని, వీధిలైట్లు అడిగిన పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాడని, సిబ్బందిని పని చేపించే విషయంలో కూడా శ్రద్ధ వహించడం లేదని ఆరోపణలు చేశారు. పంచాయతీ కార్యదర్శి డాకు నాయక్ గతంలో సంత డబ్బులు వసూలు చేయడంలో నిర్లక్ష్యం వహించి 60 లక్షలు గ్రామపంచాయతీ ఆదాయానికి గండిపడేలా చేశారని దీనిపై రికవరీ విషయంలో ప్రస్తుతం విజిలెన్స్ విచారణ జరుగుతుందని, ప్రస్తుతం కూడా పశువుల సంత కాంట్రాక్టర్ వద్ద ప్రతినెల వసూలు చేసే ఇన్స్టాల్మెంట్ ప్రీమియం డబ్బులు వసూలు చేయుటలో గతం మాదిరిగానే వసూలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాడని ఆరోపణలు చేస్తూ కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన దానిలో పేర్కొన్నారు.

# గీతకార్మికుల జీవనాధారంపై గొడ్డలి

### కలెక్టరేట్ ముట్టడించిన బాధితులు.

### తాటి చెట్ల అక్రమ నరికివేతపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్.

### కలెక్టర్ స్నేహశబరీష్‌కు వినతిపత్రం వెంటనే విచారణకు అధికారులకు ఆదేశాలు.





డోర్నకల్ ప్రతినిధి జూలై 20 సూర్యాన్యూస్. సీరోలు మండలం తాళ్లసంకీస గ్రామ పరిధిలో గీతకార్మికుల జీవనాధారమైన తాటి చెట్లను అక్రమంగా నరికివేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గీతకార్మికులు సోమవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. చేతుల్లో ప్లకార్డులు, నినాదాలతో నిరసన వ్యక్తం చేస్తూ తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తాటి చెట్లను అక్రమంగా నరికివేయడంతో తమ కుటుంబాల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతిన్నదని, బాధ్యులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే గీత వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ సమస్యను సానుకూలంగా పరిశీలించి, ఘటనపై వెంటనే విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకునేలా తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో గీతకార్మికులు, సంఘం నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని కోరారు.

# ఇరవై ఏళ్ల తర్వాత ఒకేచోట కలిసిన గురువులు, శిష్యులు

### వెల్లువిరిసిన వాణి సెకండరీ స్కూల్ పూర్వ విద్యార్థుల ఆప్యాయత



రామగిరి జూలై 20 సూర్య న్యూస్:- కాలం ఎంత గడిచినా గురు- శిష్యుల అనుబంధం చిరస్థాయిగా నిలుస్తుందనే విషయాన్ని రామగిరి మండలంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మరోసారి చాటిచెప్పింది. సెంటినరీ కాలనీలోని వాణి సెకండరీ స్కూల్‌లో 2005–06 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై కలుసుకుని భావోద్వేగ క్షణాలను పంచుకున్నారు. పాఠశాల జీవితంలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సహచరులతో ఆనందంగా గడిపిన పూర్వ విద్యార్థులు, తమ జీవితానికి బలమైన పునాది వేసిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. గురువులు కూడా విద్యార్థులు ఎన్నేళ్లు గడిచినా తమను గుర్తుంచుకుని ఆహ్వానించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇటువంటి సమ్మేళనాలు పాత స్నేహాలను పునరుద్ధరించడంతో పాటు గురు–శిష్యుల అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం అందరూ కలిసి జ్ఞాపిక ఫొటోలు దిగుతూ చిరస్మరణీయ క్షణాలను పదిలపరుచుకున్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక శాస్త్ర ఉపాధ్యాయురాలు నాగ శ్రీలక్ష్మి, గణిత ఉపాధ్యాయురాలు శిరీష, హిందీ ఉపాధ్యాయురాలు లక్ష్మి, పరిపాలనా విభాగానికి చెందిన సరోజ, శారీరక విద్య ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయుడు రామ్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. హిమవర్ష ఠాకూర్, పంజాల అవినాష్, పరపెల్లి వంశీ, ప్రియాంకతో పాటు పలువురు పూర్వ విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోర వైఫల్యం

### సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి తీవ్ర విమర్శ.

### ప్రభుత్వ వైఫల్యాలపై ఆగస్టు 6 నుంచి 14 వరకు మండల కేంద్రాల్లో పాదయాత్రలు నిర్వహిస్తామని ప్రకటన.



కురవి జూలై 20 సూర్య న్యూస్. కురవి మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రెండు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన మండిపడ్డారు. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా, ఏటా కోటి ఉద్యోగాలు, వంద రోజుల్లో నిత్యావసర ధరల తగ్గింపు, నల్లధనం వెలికితీత, పేదరిక నిర్మూలన వంటి హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని ఆయన మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే నీట్ పరీక్ష పేపర్లు లీక్ కావడాన్ని ఆయన ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనంగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పేదలకు ఇళ్ల స్థలాలు, గృహనిర్మాణం, చేయూత పింఛన్లు, యువతకు ఉద్యోగాల కల్పన, రైతాంగానికి సాగునీటి సదుపాయం వంటి అంశాల్లో విఫలమైందని, వైద్య, విద్యా రంగాలపై స్పష్టమైన విధానాలు లేకపోవడం ఈ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆగస్టు 6 నుంచి 14వ తేదీ వరకు మండల కేంద్రాల్లో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన సిపిఐ సీనియర్ నేత అప్పాల వెంకన్న కుమారుడు అప్పాల రాజేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, బుర్ర సమ్మయ్య, దూదికట్ల సారయ్య, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, నిలుగొండ నాగేశ్వరరావు, బాచి తదితరులు పాల్గొన్నారు.

## కమాన్‌పూర్‌లో న్యాయ అవగాహన సదస్సు



రామగిరి జూలై 20 సూర్య న్యూస్:- రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి. భవాని ఆదేశాల మేరకు ఎన్ఏఎల్ఎస్ఏ జగృతి పథకం కింద కమాన్‌పూర్ లో సోమవారం న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పారా లీగల్ వాలంటీర్లు చీటీ మహేష్, శ్రీమంతుల ప్రశాంత్ నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఉచిత న్యాయ సహాయం, మహిళల హక్కులు, బాలల హక్కులు, నేరాల నివారణ, బాల్య వివాహాల నిషేధం తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతి అర్హుడికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని, ఏవైనా న్యాయపరమైన సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకుని తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి ఇవ్వకుంటే ఓటు కట్

### ::: తహశీల్దార్ డి జగదీశ్వర ప్రసాద్





చంద్రుగొండ జులై 20 సూర్య న్యూస్:- రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చంద్రుగొండ మండల వ్యాప్తంగా 85 శాతం ఎస్ఐఆర్ నమోదు కార్యక్రమం పూర్తయినట్లు మండల తహశీల్దార్ డి జగదీశ్వర ప్రసాద్ తెలిపారు. సోమవారం రెవిన్యూ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.... జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా చంద్రుగొండ మండలంలో ఉన్న 27 పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటివరకు 85 శాతం ఎస్ఐఆర్ నమోదు కార్యక్రమం పూర్తయినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్ కేంద్రంలో బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు స్వీకరించి వెంటనే ఆన్ లైన్ చేస్తున్నారన్నారు. ఇంకా 15 శాతం మిగిలిపోయిన ఎన్యూమరేషన్ ఫారాలు నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. అలాగే ఇనుమురేషన్ ఫారాలు అందుకున్న ఓటర్లు తప్పనిసరిగా తమ వివరాలను అందులో పొందుపరిచి మీ బిఎల్ఓ లకు తప్పనిసరిగా అందించాలన్నారు. ఒకవేళ ఫారాలు అందించనట్లయితే తమ ఓటును బిఎల్వోలు తొలగిస్తారని తెలిపారు. అలాగే డబల్ ఓటు ఉన్నా కూడా ఒకచోట నమోదు చేయించుకొని మరోచోట డిలీట్ చేయించాలని కోరారు. రెండు ఓట్లకు దరఖాస్తులు ఇస్తే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా పడుతుందన్నారు. కావున తమ వద్ద ఉన్న ఇన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా తిరిగి మీ బిఎల్ఓ లకు తగిన సమాచారంతో అందించాలని సూచించారు. భారత రాజ్యాంగం మనకు కల్పించిన మొదటి హక్కు ఓటు దానిని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అన్నారు.

## దశదిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



రామగిరి జూలై 20 సూర్య న్యూస్:- ముత్తారం మండలం కేశనపల్లికి చెందిన మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం తండ్రి చొప్పరి లింగయ్య దశదిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చొప్పరి లింగయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన మంత్రి, ఆయన సేవలను, మంచి వ్యక్తిత్వాన్ని గుర్తు చేసుకున్నారు. చొప్పరి లింగయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని చొప్పరి లింగయ్యకు నివాళులర్పించారు.

## కాంగ్రెస్ హయాంలోనే మహిళలకు పెద్దపీట

### ::: గుర్రాల సంతోష శ్రీనివాస్



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూలై 20 సూర్యా న్యూస్ భువనగిరి మున్సిపల్ లోని 13 వార్డు లో ఇందిరాశక్తి ఇందిరమ్మ చీరలను అవార్డు కౌన్సిలర్ గుర్రాల సంతోష శ్రీనివాస్ సోమవారం మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ హయాంలోనే మహిళలకు పెద్దపీట వేశారని, వారు గౌరవంగా బతికేలా ఎన్నో సంక్షేమ పథకాలు తెచ్చిందని అన్నారు. అందుకే భువనగిరిలో జరిగే ప్రతి ఎన్నికల్లో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి, వార్డు మహిళా సంఘాల తదితరుల పాల్గొన్నారు

# రైల్వే నోటీసులతో రోడ్డున పడ్డాం

**ఇళ్లు కోల్పోతున్న బాధితు లకు న్యాయం చేయాలి , గరీబోళ్లం ఆదుకోండి**

**ఆర్ డి ఓ కు వినతిపత్రం అందజేసిన నిర్వాసితులు**





యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జులై 20 సూర్య న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి రైల్వే స్టేషన్ సమీపంలో ఇళ్లు కోల్పోతున్న భూబాధితులు, నిర్వాసితులు తమని ఆదుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకున్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాయగిరి రైల్వే స్టేషన్ విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులు వచ్చి భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డికి తమ సమస్యలు విన్నవిస్తూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, తాము వందల సంవత్సరాలుగా అక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నామని, ప్రభుత్వానికి సంబంధించిన అన్ని రకాల పన్నులు, ఇతర ట్యాక్స్‌లు చెల్లిస్తున్నామని తెలిపారు. రాయగిరి రైల్వే స్టేషన్ విస్తరించనున్న సందర్భంగా స్టేషన్ సమీపంలో ఉన్న మా ఇండ్లను ఖాళీ చేయాలని రైల్వే అధికారులు ఇప్పటికే రెండు నోటీసులు జారీ చేసి ఇళ్లు ఖాళీ చేయాలని ఆదేశించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా కడు పేదవారమని, జట్కా బండి తోలుకుంటూ, కూలి పనులు చేసుకుంటూ అర్ధాకలితో జీవిస్తున్నామన్నారు. మా తాతలు ముత్తాతలు దగ్గర నుంచి మేమంతా ఇదే ఇళ్లలో జీవిస్తున్నామని ఇల్లు కోల్పోతే తాము మరో ఇల్లు కట్టుకునే ఆర్థిక స్తోమత గాని, స్థలాలు గాని లేవని మా ఆవేదనను పరిగణలోకి తీసుకొని మాకు వేరే ప్రాంతంలో స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని అధికారులను వేడుకొన్నారు. రైల్వే స్టేషన్ విస్తరించడంలో మాకు ఏమాత్రం అభ్యంతరం లేదని, కానీ విస్తరణ పేరుతో మా కుటుంబాలను రోడ్డుపాలు చేయవద్దని వేడుకున్నారు. ఇళ్లు కోల్పోతున్న ప్రతి కుటుంబానికి న్యాయమైన నష్టపరిహారం అందించడంతో పాటు, ప్రభుత్వం నిర్మించే ఇళ్లతోపాటు ఇంటి స్థలాలను కూడా కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. తమకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు..

# సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలి

**కోమటిరెడ్డి చంద్రారెడ్డి డెత్ క్లెయిమ్స్ ను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు**

**జీవో నెం. 12 ను రద్దు చేసి లేబర్ డిపార్ట్మెంట్ ద్వారానే డెత్ క్లెయిమ్స్ అమలు చేయాలి**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జులై 20 సూర్య న్యూస్ సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దుచేయాలని,అదేవిధంగా డెత్ క్లెయిమ్స్ ను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, జీవో నెంబర్ 12 ను రద్దుచేసి డెత్ క్లెయిమ్స్ ను లేబర్ డిపార్ట్మెంట్ ద్వారానే అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ ముందు జరిగిన భవన నిర్మాణ కార్మికుల ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, బీసీడబ్ల్యుయు జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగె సోములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత భవనిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ బోర్డు నిధులను, సిఎస్సి టెస్ట్ ల ద్వారా ఒక్కో కార్మికుడి పేరుమీద డబ్బులు కేటాయిస్తూ ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పడంతో కార్మికుల కష్టార్జితం అయిన బోర్డు డబ్బులను దుబారా ఖర్చు చేస్తుందన్నారు. బోర్డు నిధులను తన అనుయాయులకు అందిస్తుందని, కార్మికులకు ఎలాంటి ఉపయోగం లేదని, అందుకే తక్షణమే సిఎస్సి టెస్ట్ లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. డెత్ క్లెయిమ్స్ ను కూడా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చేందుకు తెచ్చిన జీవో నెం. 12 ను రద్దు చేసి, లేబర్ డిపార్ట్మెంట్ ద్వారానే అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.పెండింగ్ లో ఉన్న క్లైమ్సుకు వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అందించే దగ్గర లేబర్ డిపార్ట్మెంట్లో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే తగ్గించాల న్నారు. 55 సంవత్సరాలు పైబడిన నిర్మాణ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.6000 పెన్షన్ గ్యారెంటీ చేయాలన్నారు. పిల్లల చదువుల నిమిత్తం స్కాలర్షిప్లు బోర్డ్ ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. పనిముట్లు కొనుక్కునేందుకు బోర్డ్ ద్వారా రుణ సదుపాయం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, సంఘం గౌరవ అధ్యక్షులు దాసరి పాండు, మాయ కృష్ణ, చీమకండ్ల శ్రీరాములు, పోతరాజు జహంగీర్, గంధంమల్ల మాతయ్య, తదితరులు పాల్గొన్నారు.



# భాషా పరివర్తనపై ప్రధానోపాధ్యాయులకు సమగ్ర శిక్షణ

హనుమకొండ టౌన్ జులై 20 సూర్య న్యూస్:- హనుమకొండ జిల్లా ప్రభుత్వ పాఠశాల వడ్డేపల్లిలో (ఎల్ఎఫ్ ఎల్ హెచ్) భాషా పరివర్తనపై ప్రధానోపాధ్యాయులకు సోమవారం నుండి బుధవారం వరకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం రోజు శిక్షణ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్ గా సురేష్ వ్యవహరించారు. శిక్షణ కార్యక్రమంలో నాయకత్వ లక్షణాలు, పఠనం,రాయడం గణిత నైపుణ్యాలు,(ఎఫ్ఎల్ఎన్), ఆధార రేఖ,మధ్యంతర రేఖ మూల్యాంకన రేఖ (బేస్ లైన్, మిడ్లైన్, ఎండ్ లైన్) గురించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, పలిత శ్రీహరి, రావుల రమేష్, ఆర్పీలు వింజమూరి వేణు గోపాలస్వామి, దండే రాజమౌళి, భగవాన్ రెడ్డి, వివిధ మండలాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# జాతీయ ఆహార భద్రత చట్టానికి సవరణలు చేయాలనే ఆలోచన విరమించుకోవాలి

**2016 ఆర్ పి డి చట్టం రాష్ట్ర వికలాంగుల సలహా మండలి ఏర్పాటు చేయాలి**

**ఎన్ పి ఆర్ డి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా ఏవో ఎన్ అంజి రెడ్డికి నీతి పత్రం**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జులై 20 సూర్య న్యూస్ జాతీయ ఆహార భద్రత చట్టానికి సవరణ చేయాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఎన్ పి ఆర్ డి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు స్వరూపంగ ప్రకాష్, వనం ఉపేందర్లు డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల జాతి వేదిక (ఎన్ పి ఆర్ డి) ఆధ్వర్యంలో వికలాంగులు సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గీవెన్స్ డే సందర్భంగా వికలాంగులు ఏవో ఎన్ అంజి రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సురూపంగా ప్రకాష్, వనం ఉపేందర్ మాట్లాడుతూ, 2016 ఆర్ పి డి చట్టం సలహా మండలి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం 2013 జాతీయ ఆహార భద్రత చట్టానికి సవరణలు చేయాలని చేసిన నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవలసిన అవసరం.గ్రామీణ ప్రాంతంలోని వికలాంగులతో పాటు పేదలకు ఆహార భద్రత చట్టం ఉపయోగపడుతుందన్నారు. ఆహార భద్రత చట్టం వలన నిరుపేదలకు, అంత్యోదయ రేషన్ కార్డు వలన కుటుంబ సభ్యులతో సంబంధం లేకుండా 35 కిలోల బియ్యం అందుతున్నాయన్నారు. ప్రతి మనిషికి 7 కేజీల బియ్యం మాత్రమే ఇవ్వాలని సవరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేసిందని, ఈ నిర్ణయం వికలాంగుల కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందని,కుటుంబ సభ్యులతో సంబంధం లేకుండా వికలాంగులకు, పేదలకు అంత్యోదయ రేషన్ కార్డు ఇవ్వాలని కోరారు.2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం వికలాంగులకు సమానత్వం, గౌరవ ప్రదమైన జీవనం, వివక్షత లేకుండా చూడడం, విద్యా, ఉపాది, ఆరోగ్యం, సామాజిక భద్రతతో పాటు అన్ని రంగాల్లో సమాన భాగస్వామ్యం కల్పించాలని పేర్కొన్నదన్నారు. వీటిని పర్యవేక్షణ చేయడానికి 2016 ఆర్పిడి చట్టంలోని సెక్షన్ 66 ప్రకారం రాష్ట్ర వికలాంగుల సలహా మండలి ఏర్పాటు చేయాలన్నారు. 2019లో ఏర్పాటు అయినా సలహా మండలి కాలపరిమితి ముగిసి 4 ఏండ్లు అవుతున్న రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రాష్ట్ర వికలాంగుల సలహా మండలి ఏర్పాటు చేయడానికి ఎలాంటి ప్రయత్నం చేయడం లేద వారు విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వలన వికలాంగుల చట్టం అమలుపై పర్యవేక్షణ లోపిస్తుందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సలహా మండలి ఏర్పాటు చేసే విదంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్ర మంలో ఎన్ పి ఆర్ డి జిల్లా కోశాధికారి కొత్త లలిత, గడ్డం యాదగిరి, కొలిలిపాక నాగయ్య, వస్తుప్పల మంజుల, ఏశాల గోపి, వల్లాల రాధాకృష్ణ, నూకల వెంకటేష్, స్వామి, వడ్డే సుజాత తదితరు పాల్గొన్నారు.



## ప్రతిభావంతులైన విద్యార్థులకు పతకాల ప్రధానోత్సవం

**ఎమ్మెల్యే కుంభం , ప్రతిభలో ముందున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు**

**పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి**

**కల్పనా ఫౌండేషన్ త్రివేణి సాహితి సంఘం నిర్వాహలను అభినందించిన ఎమ్మెల్యే**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూలై 20 సూర్య న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండల కేంద్రంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పథకాలు ప్రధానోత్సవం చేశారు. ఆదివారం పోచంపల్లి మున్సిపాలిటీలోని మీటింగ్ హాల్‌లో కల్పన ఫౌండేషన్, త్రివేణి సాహితి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజర య్యారు. అదేవిధంగా పద్మశ్రీ గజం అంజయ్య ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోచంపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 32 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు వెండి, కాంస్య పతకాలను అందజేసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రతిభలో ఏమాత్రం వెనుకబడి లేరని, పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని అన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్న కల్పన ఫౌండేషన్, త్రివేణి సాహితి సంఘం నిర్వాహకులను అభినందించారు. భవిష్యత్తులో మరింత కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేష్, వైస్ ఛైర్పర్సన్ కొయ్యడ రజిని--శ్రీనివాస్, తడక యాదగిరి, పట్నం కృష్ణ కుమార్, తడక లావణ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, కల్పన ఫౌండేషన్ -- త్రివేణి సాహితి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈనెల 22న జిల్లా కేంద్రంలో ప్రత్యేక జాబ్ మేళా

**జిల్లా అధికారిణి ఎన్. పద్మ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు**

**18 నుంచి 35 సంవత్సరాలు వారు అర్హులు.. 3 నెలలు ఉచిత శిక్షణ**

**నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూలై 20 సూర్య న్యూస్ ఈనెల 22వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ లోని ఉపాధి కార్యాలయంలో ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించబడు తుందని యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్. పద్మ సోమవారం తెలిపారు. దివ్యాంగులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించబడుతుందని తెలిపారు.ఈ జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా 3 నెలల రెసిడెన్షియల్ స్కిల్ ట్రైనింగ్ అందించబడుతుందని, శిక్షణలో ఇంగ్లీష్ కమ్యూనికేషన్, బేసిక్ కంప్యూటర్స్, బీపీవో,రిటైల్ ట్రేడ్ వంటి అంశాలలో నైపుణ్యాభివృద్ధి కల్పించి, అనంతరం ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడతా యన్నారు.18 నుండి 35 సంవత్సరాల వయస్సు, 10వ తరగతి,ఇంటర్మీడియట్ డిగ్రీ చదివిన వారు అర్హులని, దివ్యాంగులు, నిరుద్యోగ యువతకు ప్రాధాన్యత కలదన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, దివ్యాంగ ధృవీకరణ పత్రం (ఉంటే), పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, బయోడేటాతో జాబ్ మేళాకు హాజరు కావాలని, మరిన్ని వివరాల కోసం 7095612963 ఫోన్ నెంబర్ ను సంప్రదించా లని జిల్లా అధికారిణి పద్మ తెలిపారు.

## అడప మహేష్ పాడె మోసిన ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు

**కుటుంబానికి అండగా ఉంటామని భరోసా**



హనుమకొండ టౌన్ జులై 20 సూర్య న్యూస్:- వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు,సోషల్ మీడియా ఇంఛార్జ్ అడప మహేష్ పెట్రోల్ దాడిలో మృతి చెందగా సోమవారం తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య,వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్, హన్మకొండ డీసీసీ ప్రెసిడెంట్స్ మహమ్మద్ ఆయుబ్,ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్ రాజ్ తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్ నాగరాజు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్ మృతదేహంపై పార్టీ జెండా కప్పి, వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తడుస్తూ అంతమయాత్రలో ఎమ్మెల్యే నాగరాజు పాల్గొని పాడె మోశారు. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడుతుందన్నారు. దోషుల అరాచకాలను అడ్డుకట్టు వేస్తానని,కఠినమైన శిక్ష పడేలా చూస్తానన్నారు. మహేష్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు.మరణవార్త తెలిసిన క్షణం నుండి ఎమ్మెల్యే నాగరాజు అన్నీ తానై దగ్గరుండి కుటుంబ సభ్యలకు అండగా నిలిచారు.మంచి కార్యకర్తను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మహేష్ పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ కంటతడి పెట్టారు.ఆయన జ్ఞాపకాలు సజీవంగా ఉంటాయని అన్నారు.అధిష్టానం ఇచ్చే సహాయం కాకుండా తన వంతుగా కూడా మహేష్ కుటుంబాన్ని ఎల్లవేళల కాపాడుకుంటామన్నారు. మహేష్ కుటుంబ సభ్యులు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ, డివిజన్, మండల,గ్రామ ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ బాలికల హాస్టల్‌కు రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయాలి

**మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్**

**145 మంది విద్యార్థులను ప్రైవేటు భవనంలోకి తరలింపు**

**పట్టణ పరిసర ప్రాంతాల నుంచి వచ్చే బాలికలకు హాస్టల్ ఎంతో అవసరం**

**సర్వేనెంబర్ ఆరులో నూతన భవన నిర్మాణం చేయాలి**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూలై 20 సూర్యా న్యూస్ భువనగిరి పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్ నూతన భవన నిర్మాణానికి రూ. 3 కోట్లు మంజూరు చేయవలసిందిగా భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ ల సాధికారత శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థలో ఉన్నదని, దాని స్థానంలో కొత్త హాస్టల్ నిర్మించాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాంగిర్ మంత్రిని కోరారు. భువనగిరి పట్టణంలోని ఖాజీమొహల్లా వీధిలో సర్వే నంబర్--6లో ఉన్న ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో, 2019--20 విద్యా సంవత్సరం నుంచి హాస్టల్‌లోని 145 మంది విద్యార్థినులను ప్రైవేట్ భవనానికి తరలించి అక్కడే వసతి కల్పిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఎస్సీ కాలేజీ బాలికల హాస్టల్ కూడా అదే ప్రైవేట్ భవనంలో కొనసాగుతోందన్నారు. శిథిలమైన పాత హాస్టల్ ఉన్న ఎకరం విస్తీర్ణం ప్రభుత్వ స్థలంలోనే కొత్త భవనం నిర్మించేందుకు ఇప్పటికే ప్రభుత్వ ఎస్సీ అభివృద్ధి శాఖ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. భువనగిరి పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి ఉన్నత విద్య కోసం వచ్చే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బాలికలకు ఈ హాస్టల్ ఎంతో అవసరమని, విద్యార్థినుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత భవనంలో తగిన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అందువల్ల భువనగిరి పట్టణంలోని సర్వే నంబర్--6లోని ప్రభుత్వ స్థలంలో నూతన ప్రభుత్వ ఎస్సీ కాలేజీ, బాలికల హాస్టల్ భవన నిర్మాణం చేపట్టేందుకు రూ.3 కోట్ల నిధులను తక్షణమే మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని బర్రె జహంగీర్, 8వ వార్డ్ కౌన్సిలర్ తాహెరా - బబ్లు కోరారు. ఆయన వెంట కోఆప్షన్ సభ్యులు సుజాత్ అలీ కౌసర్, యోజన కాంగ్రెస్ నాయకులు రంగ శ్యామ్ గౌడ్ ఉన్నారు.

# ప్రజావాణిలో 92 ఆర్జీలను స్వీకరించిన అధికారులు

**అదనపు కలెక్టర్ వెంకారెడ్డి , ప్రజలిచ్చిన ఆర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూలై 27 న్యూస్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , డిఆర్వో జయమ్మ తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 92 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాల న్నారు. అందులో రెవిన్యూ శాఖ 56 ,సర్వే ల్యాండ్స్ 9, గ్రామీణ అభివృద్ధి 6, మున్సిపాలిటీ 4,సంక్షేమ శాఖ 3, పంచాయతీ 3, డిసి ఓ 2, ఇరిగేషన్ 2, వైద్య ఆరోగ్య 2,ఎస్సీ కార్పొరేషన్ , ఎస్సీ డెవలప్మెంట్, ఆర్ అండ్ బి, ఉపాధి కల్పన, జిల్లా పరిషత్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, హౌసింగ్ పీడీ అలివేలు , ఆర్డీవో కృష్ణారెడ్డి , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

**జిల్లా కలెక్టర్‌కు టీయూడబ్ల్యూజే (ఐజేయూ)నేతల వినతి**



రామగిరి జూలై 20 సూర్య న్యూస్:- జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ)రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు మల్లవర్జల వంశీ విద్యానంద్, జిల్లా కార్యదర్శి నారాయణదాసు అశోక్ తదితరులు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో వివిధ దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో సుమారు 600 మందికి పైగా జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న తమ పిల్లలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుతున్నారని పేర్కొన్నారు. గత కొంతకాలంగా జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థలు జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ కల్పిస్తున్నాయని, జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కూడా ఈ విషయంలో సహకారం అందిస్తున్నారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించేలా జిల్లా యంత్రాంగం చొరవ తీసుకుని విద్యా సంస్థలతో సమన్వయం చేసి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు పాలకుర్తి విజయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టీకే శ్రీనివాస్, జిల్లా కమిటీ నాయకులు ముత్యాల నరసయ్య, జక్కుల సత్యనారాయణ, ఎండి జబ్బర్ ఖాన్, బాలసాని రాజయ్య, మంథని రమేష్, వీరమల్ల విద్యాసాగర్ రావు,ఆకుల రమేష్, తాటిపెల్లి శ్రీనివాస్, తిరుమల సురేష్, రంజిత్, జైపాల్, ఇబ్రహీం, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## కొండమల్లేపల్లిలో ఇంటింటి మొక్కల పంపిణీ చేసిన సర్పంచ్

**సర్పంచి పసునూరు యుగంధర్ రెడ్డి**



కొండమల్లేపల్లి, జూలై 20 సూర్య న్యూస్ :- రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి మొక్కల కార్యక్రమంలో భాగంగా కొండమల్లేపల్లి మండల కేంద్ర గ్రామ పంచాయతీ సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి సోమవారం గ్రామంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ కాలనీలో ప్రతి ఇంటికి 2 మొక్కల చొప్పున అందజేసి వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యం ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంట్లో హరితాన్ని పెంచి, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి, సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి పసునూరి యుగేందర్ రెడ్డి , పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్, ఉప సర్పంచ్ భర్త కొడిదాల వెంకటయ్య,వార్డు సభ్యులు గంట మల్లేష్, బిజిలి లింగయ్య, పర్వతం కొండల్,వస్కుల బక్కలయ్య, వస్కుల శ్రీను గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# నూతన కార్యవర్గ పదవీ బాధ్యతల స్వీకరణ

**ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కుంభం**

**పోచంపల్లి చేనేతకు ప్రపంచవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు**

**చేనేత రంగం తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక**

**నూతన కార్యవర్గం పోచంపల్లి విశిష్టతను మరింత విస్తృతపరచాలి**

**చేనేత కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం**





యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూలై 20 సూర్య న్యూస్ పోచంపల్లి పట్టణంలోని బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహించిన పోచంపల్లి చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గ పదవీ బాధ్యతల స్వీకరణ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పట్టణ కేంద్రంలోని తెలంగాణ ఉద్యమ ప్రముఖుడు, పద్మశ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోచంపల్లి చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన భారత లవకుమార్ తో పాటు నూతన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, పోచంపల్లి చేనేతకు ప్రపంచవ్యాప్తంగా విశిష్టమైన గుర్తింపు ఉందని, ఈ ఖ్యాతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత పరిశ్రమ అభివృద్ధి, మార్కెటింగ్ సౌకర్యాల విస్తరణకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. చేనేత రంగం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్న ఆయన, నూతన కార్యవర్గం చేనేత కార్మికుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తూ సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. పోచంపల్లి చేనేత ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో మరింత విస్తరించేందుకు ప్రభుత్వం, చేనేత కార్మికులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పోచంపల్లి పట్టణ, మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, చేనేత కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ సహకార సంఘాల ప్రతినిధులు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# కిరణ్ చూపు సంజీవం...

**నేత్రదానంతో ఇద్దరికి వెలుగు, మైలగాని కిరణ్ కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం సమాజానికి ఆదర్శం**





రామగిరి జూలై 20 సూర్య న్యూస్:- రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన మైలగాని కిరణ్ ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు. తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ ఆయన కుటుంబ సభ్యులు గొప్ప మానవతా దృక్పథంతో నేత్రదానం చేయాలని నిర్ణయించారు. మృతుడి తల్లి వనమాల, భార్య అనూష, సోదరుడు కిషోర్ నేత్రదానానికి అంగీకరించగా వెంటనే ఈ విషయాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఐ విజన్ యాక్టివిటీ చైర్మన్ గంట వెంకటరమణారెడ్డికి తెలియజేశారు. సమాచారం అందుకున్న వెంటనే గంట వెంకటరమణారెడ్డి నేత్రదాన సాంకేతిక నిపుణుడు ప్రదీప్ కు సమాచారం అందించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని ప్రదీప్, లయన్స్ క్లబ్ జిల్లా కమిటీ చైర్మన్ మేకల మారుతి యాదవ్ ఆధ్వర్యంలో మైలగాని కిరణ్ నేత్రాలను విజయవంతంగా సేకరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు గంట వెంకటరమణారెడ్డి, మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ నేత్రదానం మహాదానమని, ఒకరి మరణానంతరం వారి నేత్రాలు ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపగలవన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలని కోరారు. మైలగాని కిరణ్ కుటుంబ సభ్యులు తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ శరణ్య యాదవ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఒరే సదయ్య, కల్వచర్ల ఉప సర్పంచ్ కస్ప మహేందర్, వార్డు సభ్యులు గోనె రాము, బండ సంపత్, మాజీ ఉపసర్పంచ్ వేము కనకయ్య, మాజీ ఎంపీటీసీ మెట్టు కిష్టయ్య, కాటా రాజేందర్, ఆసం రాజు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని మృతునికి ఘనంగా నివాళులర్పించారు.

# వారానికి మూడు కోడి గుడ్లు ఇవ్వలేము

**మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు**

**పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా డబ్బులు ఇవ్వాలి**

**మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలకు 10000 వేతనం ఇవ్వాలి**

**రెండు కూరలకు బదులు ఒక కూరకే డబ్బులు ఇస్తున్న ప్రభుత్వం**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూలై 20 సూర్య న్యూస్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా డబ్బులు ఇవ్వని యెడల వారానికి మూడు కోడి గుడ్లు ఇవ్వలేమని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం మహిళలు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకారెడ్డి కి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు ఊదరి వరలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలకు నెలకు పదివేల రూపాయల వేతనం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రతి రోజూ ప్రభుత్వ పాఠశాలల్లో రెండు కూరలు వండిపెడితే, ప్రభుత్వం కేవలం ఒక కూర వంటకు సంబంధించిన డబ్బులు మాత్రమే ఇస్తుందని ఆమె తెలిపారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, లేనిచో పెరిగిన ధరలకు అనుగుణంగా ఏజెన్సీ మహిళలకు అదనపు డబ్బులు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు , విజయ , స్వప్న, శోభ, స్వప్న ,వసంత, రమణ తదితరులు పాల్గొన్నారు

# ఠాకూర్ కాంబాట్ అకాడమీ ఘన ప్రారంభం

**సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్, ఆత్మవిశ్వాసం క్రమశిక్షణ పెంపొందించుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఉపయోగం , అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దటమే ధ్యేయం**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూలై 20 సూర్యా న్యూస్ : భువనగిరి పట్టణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఠాకూర్ కాంబాట్ అకాడమీని సోమవారం భువనగిరి టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ ప్రారంభించారు. చిన్నారులు, యువత, మహిళలు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ నైపుణ్యాలు మరియు క్రీడా ప్రతిభను పెంపొందించు కోవాలనే లక్ష్యంతో ఈ అకాడమీని ప్రారంభించామని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవకార్యక్రమానికి భువనగిరి టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్యామ్ సుందర్, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి, నవభారత్ యూత్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సరగడ కరుణ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని, ఇటువంటి అకాడమీలు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ అకాడమీని ఠాకూర్ నితేష్ సింగ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఎన్ ఎస్ ఎన్ ఐ ఎస్ పాటియాలా, (టూ (గ్రేడ్) సర్టిఫైడ్ కోచ్, 18 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు నిర్వహిస్తు న్నారని తెలిపారు. ఈ అకాడమీలో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, బాక్సింగ్, కిక్‌బాక్సింగ్,రెజ్లింగ్ వుషు,స్ట్రెంగ్త్, కండిషనింగ్ సెల్ఫ్ డిఫెన్స్,వెపన్స్ ట్రైనింగ్ మొదలైన వాటిపై శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ అకాడమీలో అన్ని వయస్సుల వారికి ప్రత్యేక శిక్షణ అందించబడుతుందని, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తీర్చిదిద్దడమే అకాడమీ ప్రధాన లక్ష్యమని శిక్షకుడు ఠాకూర్ నితేష్ సింగ్ తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని ఆయన పిలుపునిచ్చారు.

# కిట్స్ వాకర్స్ మహాత్మా గాంధీ ఫెలోషిప్ సభ్యులకు సన్మానం





హనుమకొండ టౌన్ జూలై 20 సూర్య న్యూస్:- హసన్పర్తి మండల కేంద్రం కిట్స్ కళాశాల మైదానంలో కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొక్క కుమార్ అధ్యక్షతన మహాత్మా గాంధీ ఫెలోషిప్ మెంబర్ షిప్ తీసుకున్న బొక్క కుమార్,303 ఇంటర్నేషనల్ వాకర్స్ డిప్యూటీ గవర్నర్ నాగమల్ల సుధీర్ జిల్లా బాధ్యులు ఆర్మీ మల్లేష్ లకు 303 ఇంటర్నేషనల్ వాకర్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ పుల్లూరు శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా సోమవారం రోజు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ పుల్లూరు శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఫెలోషిప్ ఇంటర్నేషనల్ వాకర్స్ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మహాత్మా గాంధీ ఫెలోషిప్ ద్వారా వసూలు చేయబడిన ఆర్థిక సహాయాన్ని విపత్తులబారిన పడిన ప్రజలకు వినియోగించడం జరుగుతుందని తెలిపారు. కిట్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ జిల్లా ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ కు చేదోడు వాదోడుగా ఉంటున్నారని, మా కోరిక మేరకు మహాత్మా గాంధీ ఫెలోషిప్ మెంబర్షిప్ తీసుకున్న సభ్యులు వారి సేవా దృక్పథానికి ఉదార స్వభావానికి ధన్యవాదములు అని అన్నారు. ఇకముందు కూడా కిట్స్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జిల్లా అసోసియేషన్ కు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొక్క కుమార్ మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెట్లు నాటడం, రక్తదాన శిబిరం, ప్రత్యేక దినోత్సవాల సందర్భంగా పండ్ల పంపిణీ, పర్వదినాల్లో మజ్జిగ పంపిణి వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇకముందు కూడా కొనసాగిస్తామని, జిల్లా అసోసియేషన్ కు మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. తదనంతరం మహాత్మా గాంధీ ఫెలోషిప్ తీసుకున్న సభ్యులను గవర్నర్ శాలువాతో సత్కరించి షీల్డులు అందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పాపి శెట్టి శ్రీధర్ పూర్వ అధ్యక్షులు పుల్లా దుర్గారామ్ కార్యదర్శి చకిలం చంద్రశేఖర్ కోశాధికారి జిల్లా బాధ్యులు గూడూరు లక్ష్మీనారాయణ ఇతర కార్యవర్గ సభ్యులు వాకర్స్ మిత్రులు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి ఓటును కాపాడటమే లక్ష్యం--ఎమ్మెల్యే నాయిని

**బిఎల్ఏ లు గడప గడప ప్రచారం నిర్వహించాలి**

**జీడబ్ల్యూఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం**

**సర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ విస్తృత సమీక్ష**



హనుమకొండ టౌన్ జూలై 20 సూర్య న్యూస్:- హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్చార్జీలు, మాజీ కార్పొరేటర్లు, సర్ (ఎస్ఐఆర్) బూత్ ఇన్చార్జీలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సోమవారం విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, సర్ వరంగల్ పార్లమెంట్ ఇన్చార్జ్ నాసీర్ అహ్మద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో గత నెల రోజులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో సర్ ప్రక్రియలో డివిజన్, బూత్ల వారీగా జరిగిన పురోగతిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమగ్రంగా సమీక్షించారు. ప్రతి డివిజన్లో ఇప్పటివరకు జరిగిన పని, ఎదురవుతున్న సమస్యలు, బూత్ల వారీగా నమోదవుతున్న పురోగతిపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజులు అత్యంత కీలకమని, ఈ సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి గడప గడప ప్రచారం నిర్వహించాలని, అర్హత కలిగిన ప్రతి ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేయించాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాపాడడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో పేరు లేకపోవడం, తప్పులు ఉండడం, చిరునామా మార్పులు, ఇతర సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించి అవసరమైన దరఖాస్తులు పూర్తి చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సర్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి ఓటును కాపాడేందుకు రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అదే స్ఫూర్తితో ప్రతి నాయకుడు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు.చాలా వరకు షిఫ్టెడ్ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.మరణించిన వారి ఓట్లు ఎన్ని కొత్తగా నమోదు అవుతున్నాయో లేదో క్షుణ్ణంగా పరిశీలించాలి. పొందుతున్నారని "పార్టీలో పని చేసే వారికే గుర్తింపు, అవకాశాలు, పదవులు వస్తాయి. సీనియర్ అనే పేరుతో పని చేయకుండా కూర్చుంటే అవకాశాలు రావు. ప్రజల మధ్య ఉండి పార్టీ కోసం కష్టపడిన వారినే కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ గౌరవిస్తుంది" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనే స్థాయిలో పార్టీ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ముఖ్యంగా రానున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసి) ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి డివిజన్లో పార్టీని మరింత బలోపేతం చేసి విజయానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. డివిజన్ స్థాయిలో పార్టీ సంస్థాగత బలోపేతానికి త్వరలోనే డివిజన్ అధ్యక్షుల నియామకాలు చేపడతామని ఎమ్మెల్యే ప్రకటించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు, బాధ్యతలు తప్పకుండా లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ఈవి శ్రీనివాస్ రావు,పలువురు కాంగ్రెస్ నాయకులు, డివిజన్ ఇన్చార్జీలు, మాజీ కార్పొరేటర్లు, సర్ బూత్ ఇన్చార్జులు,నాయకులు పాల్గొన్నారు.

# సిరోలులో సర్పంచ్ కుటుంబంపై భూ ఆక్రమణ ఆరోపణలు.. కలెక్టర్‌కు దళిత రైతుల ఫిర్యాదు


COLLECTOR OFFICE

సిరోలు, జూలై 20 సూర్య న్యూస్:- మహబూబాబాద్ జిల్లా సిరోలు మండలంలోని సిరోలు గ్రామానికి చెందిన దళిత, బడుగు, బలహీన వర్గాల రైతులు స్థానిక సర్పంచ్ కుటుంబంపై ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడ్డారని ఆరోపిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు సమర్పించారు. రైతుల ఫిర్యాదు మేరకు గ్రామంలోని సర్వే నంబర్--14లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని స్థానిక సర్పంచ్ అనుమంతుల రమణ, ఆమె కుమారుడు అనుమంతుల నాగేశ్వరరావు వ్యక్తిగత ప్రయోజనాల కోసం అక్రమంగా ఆక్రమించారని పేర్కొన్నారు. ఆక్రమించిన స్థలంలో శాశ్వత గోదామును నిర్మించి, అక్కడ టెంట్ హౌస్ వ్యాపారం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ భూమి వాస్తవానికి మండల రెవెన్యూ కార్యాలయం, మండల అభివృద్ధి కార్యాలయం నిర్మాణంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఉపయోగపడాల్సి ఉండగా, ఆక్రమణకు గురై ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ధాన్యం నిల్వ చేసేందుకు సరిపడ గోదాములు లేకపోవడంతో తాము పండించిన పంటను భద్రపరచలేక ప్రతి సంవత్సరం వర్షాలు, తేమ కారణంగా భారీ నష్టాలను ఎదుర్కొంటున్నామని రైతులు తెలిపారు. ఆక్రమిత ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని రైతుల అవసరాలకు అనుగుణంగా ధాన్యం నిల్వ గోదాములు నిర్మించాలని కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వ భూములపై జరిగినట్లు ఆరోపిస్తున్న ఆక్రమణపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్తిని ప్రజల అవసరాలకు వినియోగంలోకి తీసుకురావాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. ఈ ఫిర్యాదుపై జిల్లా యంత్రాంగం ఎలా స్పందిస్తుందనే అంశం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గమనిక: పై కథనం మీరు అందించిన ఆరోపణల ఆధారంగా వార్తా శైలిలో రూపొందించబడింది ఆరోపణలకు సంబంధించి అధికారుల స్పందన లేదా సంబంధిత పక్షం వివరణ అందితే, వార్తలో దానిని కూడా చేర్చడం జర్నలిస్టిక్ సమతుల్యతకు అనుకూలంగా ఉంటుంది.

# వేములవాడ మహాత్మాజ్యోతి బాపూలే రెసిడెన్షియల్ విద్యాలయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ



**తరగతులకు రోజూ హాజరుకావాలి**
**ప్రణాళిక ప్రకారం చదవాలి**

వేములవాడ టౌన్ 20 సూర్య న్యూస్ :- విద్యార్థులు తరగతులకు రోజూ హాజరుకావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ పట్టణంలోని మహాత్మాజ్యోతి బాపూలే రెసిడెన్షియల్ విద్యాలయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కిచెన్ లోకి వెళ్లి పరిసరాలు, మెనూ చార్ట్ ప్రకారం భోజనం సిద్ధం చేశారా అని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో బియ్యం, పప్పులు గుడ్లు, ఇతర ఆహార పదార్థాల నాణ్యత, రిజిస్టర్లను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ రోజూ తరగతులకు హాజరు కావాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం చదవాలని, గత ప్రశ్న పత్రాలు సాధన చేయాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని తెలిపారు. రోజు తీరిక సమయంలో ఆటలు ఆడాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తినకముందు తిన్న తర్వాత చేతులు కడుక్కోవాలని తెలిపారు.

# అసూరి శక్తులు దూరం చేసేది భద్రకాళి మాత



హనుమకొండ టౌన్ జూలై 20 సూర్య న్యూస్:- వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు అరవ రోజుకు చేరుకున్నాయి. అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి "విప్రచిత్తా" నిత్యా గాను షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని "మహావజ్రేశ్వరి" గాను అంకరించి పూజారాధనలు నిర్వహించారు. ఎంతో పుణ్యం చేసుకుంటే వచ్చింది ఈ మనుష్య జన్మ పరోపకారార్థమిదం శరీరం అని శాస్త్రం చెబుతోంది. పరులకు ఉపకారం చేయాలంటే మన దగ్గర జ్ఞానం, ఐశ్వర్యం, అధికారం లేదా వృత్తి నైపుణ్యం ఈ నాలుగింటిలో ఏదోకటి ప్రధానంగా కలిగియుండాలి. ఈ నాలుగు కూడా నిరంతర సాధన కఠోర పరిశ్రమ చేస్తేనే గాని సమకూరవు, ప్రారబ్ధవశమున అసురీ శక్తులు జీవుడిలో అలసత్వం బద్ధకం రూపంలో ప్రవేశించి సాధనా మార్గం నుండి ప్రక్కకు తప్పించి ఆతతాయిగా మార్చి మానవ జీవితాన్ని వ్యర్థపరుస్తాయి. మానవ జన్మ సార్థకం కావాలంటే సాధనా సంపత్తి కావాలి. జీవుడు సాధనలో నిమఘ్నం కావాలంటే ఈ అసురీ శక్తులు దూరం కావాలి. అందుకు జగన్మాత అనుగ్రహం కావాలి. విప్రచిత్తా అమ్మవారు బ్రాహ్మణుల బుద్ధియందు ప్రవేశించి బ్రాహ్మణులు వేదోక్త తత్త్వజ్ఞానంతో కూడిన వేదవిహిత కర్మలను ఆచరించే విధంగా చేసి తద్వారా అగ్నిష్టోమాది శ్రోతయాగాలు జరుపుచూ తద్వారా సకల జనులు తరించే విధంగా చేస్తుంది. అట్లాగే మహావజ్రేశ్వరీ మాత సాధకుడి సంకల్పాలను వజ్రసంకల్పంగా ధృఢతరం చేసి మనిషిని సాధనలో కృతకృత్యుణ్ణి చేసి అశ్మోద్ధరణ జరుపుతుంది. అపుడు జీవుడు తాను తరిస్తూ పదిమందిని తరింపజేస్తాడు. ఈ విధంగా లోకకళ్యాణం జరుగుతుంది. జగన్మాత ఆరాధన వల్ల అని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు.అమ్మవారి దర్శనమునకు భక్తులు సాంప్రదాయమైన దుస్తులతో రావాలని, దేవాలయము, దేవాలయ ప్రాంగణంలో యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్ వీడియోలు,రీల్స్ చేయుట నిషేధించుట జరిగిందని అందుకు భక్తులు సహకరించాలని కార్యనిర్వహణాధికారి రామల సునీత కోరారు.

# సివిల్ సప్లై హమాలి వర్కర్స్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

**కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన మునీశ్వర్**




హనుమకొండ టౌన్ జూలై 20 సూర్య న్యూస్:- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జిల్లాలో పనిచేస్తున్న సివిల్ సప్లై హమాలి కార్మికులు సమస్యలు పరిష్కరించాలని సోమవారం రోజు ధర్నా నిర్వహించారు. రేషన్ ఎగుమతులు దిగుమతులు మూడు నెలలకు ఒకసారి నిర్వహించడం వల్ల హమాలీలు పని లేక వేతనాలు రాక అప్పులు తెచ్చుకొని జీవనం గడుపుతున్నారని మునీశ్వర్ వాపోయారు. గత ఆరు నెలల నుండి బిల్లులు కూడా సకాలంలో పడడం లేదన్నారు. ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపుతో సివిల్ సప్లై హమాలి కార్మికులు ధర్నా నిర్వహించారు.వేతనాలు,ఇతర సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, ఏఐటియుసి ట్రేడ్ యూనియన్ హనుమకొండ జిల్లా నాయకులు మునీశ్వర్ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కి వినతి పత్రం అందజేశారు. బియ్యాన్ని యధావిధిగా నెలకోసారి పంపిణీ చేయాలని కార్మికులకు పని కల్పించాలని వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, జిల్లా అధ్యక్షులు కుక్కల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి సందీప్, కొలువుల బిక్షపతి, పెరుగు రాజ్ కుమార్,ఎం.శంకర్, బిక్షపతి, ఆర్.కోటి, టి.యాకయ్య, కే.మహేందర్ బి.రాజు సివిల్ సప్లై హమాలి కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు.



# సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు కుటుంబసభ్యులు మృతి

సంగారెడ్డి జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. నిజాంపేట మండలం బాచుపల్లి సమీపంలోని 161వ జాతీయ రహదారిపై ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మరణించారు. వారు ప్రయాణిస్తున్న స్కార్పియో వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఈ దారుణం జరిగింది. ప్రమాద వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి ఒక కుటుంబం స్కార్పియో వాహనంలో హైదరాబాద్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న ఒక ద్విచక్ర వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు పల్టీలు కొట్టగా, అందులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలతో పాటు వారి నాలుగేళ్ల కుమార్తె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల సమాచారంతో పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# వేద సంస్కృతి పరిరక్షణకు వేములవాడ రాజన్న ఆలయం మరో ముందడుగు



**వేములవాడ టౌన్ జూలై 20 సూర్యా న్యూస్:-** వేములవాడ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెలలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయంలో వేద విద్యా పరిరక్షణ, ప్రోత్సాహానికి ప్రాధాన్యం ఇస్తూ జూలై 21 నుంచి 26 జూలై 2026 వరకు వేద పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు భీమేశ్వర సదన్ (మైత్రి గెస్ట్ హౌస్) సమీపంలో నిర్వహించబడనున్నాయి. దేశ నలుమూలల నుండి వివిధ ప్రాంతాల నుంచి వేద విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొని తమ వేదాధ్యయన ప్రతిభను ప్రదర్శించనున్నారు. వేద పారాయణం, మంత్రోచ్చారణ, స్వర శుద్ధి తదితర అంశాలపై పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహం అందించనున్నారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు 30 జూలై 2026 నుంచి 01 ఆగస్టు 2026 వరకు మూడు రోజుల పాటు “వర్ణయాగం”ను ఘనంగా నిర్వహించనున్నారు. వేదోక్త విధానంలో నిర్వహించే ఈ మహాయాగం ద్వారా రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సకాలంలో వర్షాలు కురవడం, పాడిపంటలు సమృద్ధిగా పండడం, దేశంలో శాంతి, సామరస్యం నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. వర్ణయాగం వేద సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తూ సనాతన ధర్మ పరిరక్షణకు దోహదపడే విశిష్ట ఆధ్యాత్మిక కార్యక్రమంగా భావించబడుతోంది. ఈ కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ను ఆలయ అధికారులు సోమవారం మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఆలయ ఈవో ఎల్.రమాదేవి ఆదేశాల మేరకు ఆలయ డిప్యూటీ ఈవో నవీన్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగుల మహేష్, ఆలయ ఇన్‌చార్జ్ స్థానాచార్యులు నమ్మిలికొండ ఉమేష్, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు, అర్చకులు కలిసి కార్యక్రమాల వివరాలను తెలియజేసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ వేద పరీక్షలు వర్ణయాగం వంటి కార్యక్రమాలు వేద సంస్కృతి పరిరక్షణకు, యువతలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడానికి, సమాజ శ్రేయస్సు కోసం సామూహిక ప్రార్థనలు నిర్వహించడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు.

# ఐక్యంగా ఉందాం అభివృద్ధిని అందుకుందాం : డాక్టర్ బండి సాయన్నగౌడ్

**మహబూబ్ నగర్ జిల్లా గోపా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**

**సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన ు**
**గోపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్**

**మహబూబ్ నగర్ జిల్లాలో**
**5 వేల సభ్యత్వాలే లక్ష్యమని ప్రకటించిన నూతన కమిటీ**

**గౌడ్ మేధావుల ఐక్య వేదికగా “గోపా”**




**మహబూబ్ నగర్ జూలై 20 సూర్య న్యూస్ :-** గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో గోపా మహబూబ్ నగర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని సభ్యులందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన నాయిని బాగన్న గౌడ్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గౌడ్ సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఏకైక సంస్థ గోపా అని పేర్కొన్నారు. సమాజంలో వివిధ కుల, ఉద్యోగ, సేవా సంఘాలు ఉన్నప్పటికీ, అవసరమైన సందర్భాల్లో అందరూ ఐక్యంగా పనిచేస్తేనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్ పాల్గొని, మాట్లాడుతూ, గౌడ్ సమాజ అభ్యున్నతికి అధికారులు, ఉద్యోగులు, ప్రొఫెషనల్స్, యువత ఒకే వేదికపైకి వచ్చి సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని కోరారు. విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక చైతన్యం, రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో గోపా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు గౌడ్ యువత, విద్యార్థులు, ఉద్యోగులను సంఘటితం చేసి సమాజాభివృద్ధికి కృషి చేయాలని, ప్రస్తుతం ఉన్న ప్రజాప్రతినిధులను గౌరవిస్తూ కొత్త నాయకత్వాన్ని కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ, ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో గౌడ్ సమాజం మరింత ముందుకు సాగేందుకు గోపా ఒక బలమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు. అనంతరం నూతన జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాలో 5 వేల సభ్యత్వాలను నమోదు చేయడం తమ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. నూతన జిల్లా కమిటీ లో జిల్లా అధ్యక్షుడు: నాయిని బాగన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి: కౌండిన్య రాజశేఖర్ గౌడ్, కోశాధికారి: పబ్బ శశిధర్ గౌడ్, ఉపాధ్యక్షులు: సి.సత్యనారాయణ గౌడ్, డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, గుముడాల గోవర్ధన్ గౌడ్ ఎన్నుకున్నారు. గోపా సిద్ధాంతాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లి, గౌడ్ సమాజ ఐక్యత, అభివృద్ధి కోసం నూతన కమిటీ సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# వన్ డే--వన్ వార్డ్ కార్యక్రమంలో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి





**కొంపల్లి జూలై 20 సూర్య న్యూస్ :-** సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.శ్రీజన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వన్ డే--వన్ వార్డ్' కార్యక్రమంలో భాగంగా కొంపల్లి డివిజన్ లో విస్తృత స్థాయిలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ లోని పలు కాలనీలను సందర్శించిన కమిషనర్ స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం పట్టణ సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు ఉద్దేశించబడిందని అధికారులు తెలిపారు. ఎస్ఎన్ఆర్ గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు, రోడ్లు, పార్కులు తదితర అంశాలపై స్థానికులు పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజలతో నేరుగా మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, డిప్యూటీ కమిషనర్ లావణ్య, సంబంధిత విభాగాల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సభ్యులు ప్రజాప్రతినిధులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రజావాణిలో 84 అర్జీలు స్వీకరణ



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి జూలై 20 సూర్య న్యూస్ :-** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఐడిఓసి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి అధ్యక్షతన జిల్లా రెవెన్యూ అధికారి మాలతి తో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ప్రజలతో పాటు పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల నుండి కలెక్టర్ స్వయంగా వినతులను స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 84 అర్జీలు దాఖలయ్యాయి. అనంతరం కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా అందరి దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

# విద్యార్థుల ఆరోగ్యమే వారి విజయాలకు పునాది : సెయింట్ రిటా స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ బాబు



**కుత్బుల్లాపూర్ జూలై 20 సూర్య న్యూస్ :-** విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్య తోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర రంగాల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచి విజయాలు సాధించగలరని ఏ.వి.బి. పురం లోని సెయింట్ రిటా హై స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ బాబు పేర్కొన్నారు. పిక్సల్ కంటి ఆసుపత్రి, మెడికవర్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సెయింట్ రిటా హై స్కూల్ లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కోసం ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలతో పాటు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వైద్యులు అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ రమేష్ బాబు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న వయసులోనే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించవచ్చని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఆయన పేర్కొన్నారు. పిక్సల్ కంటి ఆసుపత్రి, మెడికవర్ హాస్పిటల్స్‌కు చెందిన వైద్య బృందాలు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ శిబిరానికి విద్యార్థులు, తల్లిదండ్రులు విశేష స్పందన వ్యక్తం చేయగా, పాఠశాల యాజమాన్యం వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపింది.



# శ్రీనివాస్ నగర్ డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలి ::: అధికారులతో కలిసి పరిశీలించిన కర్కల ఉపేందర్‌రెడ్డి

**కొంపల్లి జూలై 20 సూర్య న్యూస్ :-** కొంపల్లి డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య రోజురోజుకూ తీవ్రంగా మారుతోందని, మురుగునీరు వీధుల్లోకి పొంగిపొర్లి ఇళ్ల ముందు నిల్వ ఉండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీపీసీసీ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి కర్కల ఉపేందర్ రెడ్డి అన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, కొంపల్లి సీఎంసీ డిప్యూటీ కమిషనర్, ఇంజినీరింగ్ విభాగం డీఈ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులను సంఘటన స్థలానికి రప్పించి డ్రైనేజీ పరిస్థితిని చూపించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం కోసం వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను కోరారు. అనంతరం సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజావాణిలో జోనల్ కమిషనర్ ఐఏఎస్ పింకేష్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి బైరి ప్రశాంత్ గౌడ్, కొంపల్లి కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, సీనియర్ నాయకుడు షేక్ ఇబ్రహీం, కాలనీ ప్రతినిధులు బాగయ్య, వెంకటరెడ్డి, మనోజ్, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, సత్యనారాయణ, మహేష్ రెడ్డి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్--బోయిన్‌పల్లి ఫ్లైఓవర్ పనులపై స్థానికుల ఆందోళన

**కొంపల్లి జూలై 20 సూర్య న్యూస్ :-** మేడ్చల్ నుంచి బోయిన్‌పల్లి వరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా భారీగా మట్టి పోయడం, రక్షణ చర్యలు తగినంతగా చేపట్టకపోవడంతో వర్షాల సమయం లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి జారిపోయే పరిస్థితి ఏర్పడటంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నిర్మాణ ప్రాంతంలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రమాదాలు జరగకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. అలాగే, నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ అంశంపై అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు



# పరిష్కార చర్యలతో వరద నీటి సమస్యకు ఉపశమనం

**కొంపల్లి జూలై 20 సూర్య న్యూస్ :-** జయభేరి పార్క్‌లో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నంది చౌక్, న్యూ మార్క్, పృథ్వీ అపార్ట్‌మెంట్స్ సమీపంలోని నాలాలో వరద నీరు భారీగా చేరి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న హైడ్రా సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నాలాలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. దీంతో వరద నీరు తగ్గి స్థానికులకు ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా జయభేరి గోపాల్ రెడ్డి హైడ్రా సిబ్బందిని అభినందిస్తూ, వర్షాకాలంలో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా నాలాల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# హెచ్ బిఎల్ రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులు ఆపాలని వినతి



**అలియాబాద్ జూలై 20 సూర్య న్యూస్ :-** హెచ్ బి ఎల్ రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు, వివిధ కంపెనీలకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ అలియాబాద్ మున్సిపాలిటీ 7వ వార్డు నాయకుడు గాదె వెంకటేష్ సోమవారం హకీంపేట్ డిపో మేనేజర్ సరితాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాదె వెంకటేష్ మాట్లాడుతూ హెచ్ బి ఎల్ రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన డిపో మేనేజర్ సరితాదేవి, సమస్యను సానుకూలంగా పరిశీలించి ఇకపై హెచ్ బి ఎల్ రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులు ఆగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

# మల్లాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా సందర్శించి జిల్లా వైద్య అధికారి డా. కె.ఆనంద్

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి జూలై 20 సూర్య న్యూస్ :-** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ సోమవారం ఆకస్మికంగా మల్లాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను సందర్శించి వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్య కిట్ల పంపిణీ, వాటి పనితీరును పరిశీలించి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి, నమోదైన క్షయవ్యాధి రోగులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయానికి సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియలను ధృవీకరించారు. రోగుల వివరాలు సకాలంలో నమోదు చేసి, డిబిటి ప్రయోజనాలు అందేలా చూడాలని ఆదేశించారు. అలాగే నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ కార్యక్రమం పనితీరు తక్కువగా ఉండటంపై ఆరా తీసి, స్క్రీనింగ్ లక్ష్యాలను పెంచి కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలోని ఐఎల్ఆర్ ను తనిఖీ చేసి, వ్యాక్సిన్ల నిల్వ, ఉష్ణోగ్రత నిర్వహణ మరియు రికార్డుల నిర్వహణను పరిశీలించారు. వ్యాక్సిన్ కోల్డ్ చైన్ నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నాణ్యతను పెంపొందించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.



# మూడు కేసుల్లో 40 కేజీల గంజాయి పట్టివేత

## కారు రెండు, బైకులు స్వాధీనం
## రూ.20 లక్షల విలువ చేసే గంజాయి స్వాధీనం





**క్రైమ్ బ్యూరో జూలై 20 సూర్య న్యూస్ :-** రెండు బైకుల పై వస్తున్న 13 కిలోల గంజాయిని, ఒరిస్సా నుంచి కారులో వస్తున్న 27 కిలోల గంజాయిని ఖమ్మం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 20 లక్షలు గా ఉంటుందని ఖమ్మం డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు. కారులో 27 కేజీల గంజాయిని ఒరిస్సా నుంచి తీసుకు వస్తున్నటువంటి వినయ్ సర్కార్ను అరెస్ట్ చేసి కారును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మిగిలిన రెండు కేసుల్లో మూస రవికుమార్ వద్ద 6.8 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో వేల్పుల భరత్ కుమార్ వద్ద 6.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరితోపాటు తాళ్ల ధనరాజ్ గద్దం శంకర్లు పరారీలో ఉన్నట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, ఎక్సైజ్ సూపర్డెంట్ శ్రీనివాసరెడ్డి ఎన్ఫోర్స్మెంట్ టీం ఉన్నారు.

# శివాలయ నగర్‌లో ఇళ్ల కూల్చివేత తాత్కాలికంగా నిలిపివేత..

## బాధితులకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ భరోసా





**కుత్బుల్లాపూర్ జూలై 20 సూర్య న్యూస్ :-** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సాయిబాబా నగర్ డివిజన్‌లోని శివాలయ నగర్, సర్వే నంబర్ 49లో నివసిస్తున్న నిరుపేదల ఇళ్లను రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేస్తున్నారన్న సమాచారంతో స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కూల్చివేత పనులు చేపడుతున్న స్థానిక డిప్యూటీ తాసిల్దార్ సుధాకర్, ఇతర రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులతో ఆయన మాట్లాడి, నిర్మాణాల కూల్చివేతను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరారు. అలాగే జిల్లా కలెక్టర్ మనో చౌదరితో మాట్లాడి బాధితుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రెవెన్యూ అధికారులు కూల్చివేత చర్యలను తాత్కాలికంగా నిలిపివేసి వెనుదిరిగారు. అనంతరం బస్తీ వాసులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు తమ సమస్యపై స్పందించి అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# కీసరగుట్టలో ఘనంగా శ్రీ రామలింగేశ్వర స్వామివారి పల్లకిసేవ



**కీసర సర్కిల్ జూలై 20 సూర్య న్యూస్ :-** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భవాని శివ దుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో పల్లకి సేవ ఊరేగింపు కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య స్వామివారి పల్లకిని ఆలయ ప్రాంగణం నుంచి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) కట్టా సుధాకర్ రెడ్డి, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. పల్లకి సేవ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిపారవశ్యంతో పాల్గొన్నారు.

# ప్రజా అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : అదనపు కలెక్టర్ కదిరవన్ పళని ::: ప్రజావాణిలో 1,627 దరఖాస్తులు స్వీకరణ



**హైదరాబాద్ జిల్లా బ్యూరో జూలై 20 సూర్య న్యూస్ :-** ప్రజల అర్జీలపై జిల్లా అధికారులు సత్వరమే స్పందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) కదిరవన్ పలని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు జితేందర్ రెడ్డి తో కలసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందచేసిన దరఖాస్తులను జిల్లా అధికారులు శాఖల వారీగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అలాగే సి.ఎం ప్రజావాణి, కలెక్టరేట్ ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించి సత్వరమే పరిష్కరించుటకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి లో మొత్తం 1,627 దరఖాస్తులు అందాయని అందులో హౌసింగ్ డబుల్ బెడ్ రూమ్ శాఖ కు సంబంధించి 1,462 అర్జీలు, పింఛన్లు 120, రెవిన్యూ శాఖ 16, అలాగే ఇతర శాఖలకు సంబంధించి 29 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యు ఓ అక్కేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారులు జి.ఆశన్న, కోటాజి, ఇలియాస్ అహ్మద్, ప్రవీణ్ కుమార్, డీఈవో యాదయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొంపల్లి ప్రజావాణిలో 7 ఫిర్యాదులు

**కొంపల్లి, జూలై 20 సూర్య న్యూస్ :-** కొంపల్లి సర్కిల్ సిఎంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి.లావణ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం ఏడు ఫిర్యాదులు అందగా, వాటిని వెంటనే సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సుభాష్‌నగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వద్ద అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, దూలపల్లిలో ఆక్రమణలు, కాంపౌండ్ వాల్ దెబ్బతిన్న సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు. కొంపల్లి శ్రీనివాస కాలనీ, దూలపల్లి మహాలక్ష్మి కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందాయి. అదేవిధంగా సూరారం కాలనీలో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని, శ్రీరామ్‌నగర్ లోని ఆక్రమణలను తొలగించాలని, సాయిబాబా నగర్ లో హైమాస్ట్ లైట్ల సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యంగా తీసుకుని నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండరాదని సూచించారు.

# జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ రవికుమార్‌ని కలిసిన బిఆర్ఎస్ నేతలు



**కుత్బుల్లాపూర్ జూలై 20 సూర్య న్యూస్ :-** నూతనంగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన రవికుమార్ ని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి, అనంతరం సెక్టార్ సబ్ ఇన్స్పెక్టర్ గా శ్యాంబాబు ని వారికి కూడా శాలువాతో సన్మించిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, మాజీ ప్రెసిడెంట్ ఆలూరు వెంకట శేష చారి. ఈ కార్యక్రమంలో మాజీ జనరల్ సెక్రెటరీ వెంకట శ్యామ్, శ్రీనివాస్ చారి , సింహాచలం తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# జీడిమెట్ల నూతన సిఐ రవికుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన యూఎస్ఎఫ్ఐ నాయకులు



**కుత్బుల్లాపూర్ జూలై 20 సూర్య న్యూస్ :-** జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్ ని వివిధ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రకాంత్, ఖుషి ధర్మ, నరేష్ తదితరులు పాల్గొన్నారు. నూతన సిఐ రవికుమార్ కి శాలువాతో సత్కరించి, పూల బొకే అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు న్యాయం అందించడంలో, శాంతి భద్రతల పరిరక్షణలో మీరు మరింత సమర్థవంతంగా పనిచేస్తారని ఆశిస్తున్నాం. యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారంలో మీ సహకారం ఉంటుందని నమ్ముతున్నాం" అని అన్నారు. నూతన సిఐ రవికుమార్ అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే తన ధ్యేయమని, ఎవరికైనా ఏ సమస్య ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని హామీ ఇచ్చారు.

# జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం భూములను స్వాధీనం చేసుకోండి : సిపిఐ



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి జూలై 20 సూర్య న్యూస్ :-** హైకోర్టు ఆదేశాల ప్రకారం జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం పరిధిలోకి వచ్చే ప్రభుత్వ స్థలాన్ని సుమారు 14 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని హై కోర్ట్ ఇచ్చిన తీర్పును అమలు చెయ్యాలని కోరుతూ సోమవారం ప్రజవానిలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం ఇచ్చిన సిపిఐ జిల్లా నాయకులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మే నెలలో హై కోర్టు తీర్పునిస్తే ఇప్పటివరకు ఎలాంటి చర్యలకు పునుకోలేదని దాని వల్ల మిగితా భూమి కూడా కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని కావున వెంటనే హై కోర్టు ఇచ్చిన తీర్పుని అనుసరించి భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవలనీ కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, బాబు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

EDITED, PUBLISHED AND OWNED BY N.MAHESHWAR REDDY PUBLISHED AT D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYD -500054, TELANGANA. PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYDERABAD - 500 054. RNI TELTEL 2024/90138, CONTACT NO : 8985586689, EMAIL : suryavelugutelanganadesk@gmail.com, Web SITE : www.suryavelugu.com